సమాచారం

నేడు ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

రాయదుర్గం: గోపన్‌పల్లిలో మంగళవారం ఎల్లమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అన్నసమారాధన ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



మియాపూర్: ఓల్డ్ ముంబాయి రోడ్డు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు లింగంపల్లి వద్ద నేషనల్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా చందానగర్ మెయిన్‌రోడ్డు, బీహెచ్ఈఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

క్లుప్తంగా...

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

గచ్చిబౌలి: రాయదుర్గంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రాయదుర్గం- ప్రశాసన్‌నగర్ రోడ్డులో జరుగుతున్న మోడల్ కారిడార్, స్ట్రీట్ ఫర్నిచర్ ప్రాంతాలు, ఫుట్‌పాత్ పనులను జీహెచ్‌ఎంసీ ఈఎన్‌సీ మహ్మద్ జియావుద్దీన్, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు .పనుల్లో నాణ్యతతో పాటు త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు .ఈ పర్యటనలో జెడ్సీ శంకరయ్య, ఎస్ఈ శంకర్, ఈఈ శ్రీనివాస్, డీఈ రమేష్, సీపీ మల్లికార్జున్, ఏడీసీ మెహ్రా, ఎస్‌సీసీ, హెచ్‌ఏడీఏ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీరప్ప ఆలయ నిర్మాణానికి చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రూ.2లక్షల విరాళం సోమవారం అందజేశారు. అనంతరం పనులను ఆయన పరిశీలించారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మధు తెలిపారు. బీరప్ప, శ్రీకాంత్‌యాదవ్, యాదగిరి, నారాయణ పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి'



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: పాటి- ఘణపూర్ గ్రామ పరిధిలో ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని విశ్వహిందు పరిషత్ ధర్మ ప్రచార రాష్ట్ర కోకన్వీనర్ సుభాష్ చందర్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఆశిష్‌గౌడ్ అన్నారు. సోమవారం పాటి గ్రామ సమీపంలో ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలను వారు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బీజేవైఎం, బజరంగ్‌దళ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ ఉపేందర్

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటారు. ఆదివారం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన ఏషియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ముత్తంగి విద్యార్థులు మెడల్స్, సర్టిఫికెట్లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, సర్పంచ్ ఉపేందర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు అభినందించారు.



లీకేజీలు..

- తాగునీటి పైపులైన్ మార్చాలని స్థానికుల విజ్ఞప్తి
- రోడ్లు గుంతలమయం.. రెండేళ్లుగా సమస్య తీవ్రం

మియాపూర్: ప్రధాన తాగునీటి పైపులైన్ల లీకేజీలతో తాగునీరు వృథా కావడంతో పాటు రోడ్లన్నీ గుంతలమయంగా మారుతున్నాయి. లీకేజీలకు మరమ్మతు చేస్తున్నా తిరిగి రెండు, మూడురోజులకే సమస్య పునరావృతమవుతోంది. మరమ్మతులు చేసిన చోట్ల రోడ్లు గుంతలు పడుతుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- చందానగర్, మియాపూర్ ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు వెంబడి మంజీరా ఫేజ్ -2లో 1500 ఎంఎం సామర్థ్యం గల భారీ తాగునీటి పైపులైన్ ఉంది.
- జాతీయ రహదారి పక్కన వ్యాపార, వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు విస్తరించడంతో రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. దీంతో వాహనదారులు సర్వీస్ రోడ్డును కూడా ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అయితే భారీ వాహనాలు సర్వీస్ రోడ్డు వెంబడి తిరగడంతో రహదారి దెబ్బతిని పైపులైన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. చాలా ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు కావడంతో లీకేజీలు పెరుగుతున్నాయి.
- భారీ పైపులైన్ కావడంతో ఆన్ ఆఫ్ చేసే సమయంలో ఒత్తిడి పెరిగి చిన్న లీకేజీలు భారీగా మారి నీరంతా వృథా కావడంతో పాటు పక్కనే ఉన్న కాలనీ, అపార్ట్‌మెంట్లు వాణిజ్య వ్యాపారాల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరి కార్లు, బైకులు మునుగుతున్నాయి.
- ఎప్పుడు పైపులైన్ పగులుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- గతంలో అర్చన హాస్పిటల్ సమీపంలో, గంగారం హనుమాన్ ఆలయం, మదీనాగూడలోని బజాజ్ ఎలక్ట్రానిక్ సమీపంలో పైపులైన్ భారీగా పగిలి ఒక్కసారిగా నీరు పక్కనే ఉన్న కాలనీ, అపార్ట్‌మెంట్లలోకి చేరింది.
- చందానగర్‌లోని పోలీస్‌స్టేషన్ కూడలి వద్ద, మదీనాగూడలోని బజాజ్ ఎలక్ట్రానిక్, విజేత సూపర్ మార్కెట్ పక్కన, ఆల్విన్ క్రాస్ రోడ్డులో లీకేజీల పర్వం కొనసాగుతోంది.
- లీకేజీలతో పైపులైన్ అతుకులు ఏర్పడి శిథిలావస్థకు చేరింది. ఈ పైప్‌లైన్ పగిలితే నీటి ప్రవాహానికి కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులు దృష్టి సారించి పైపులైన్ మార్చాలని కోరుతున్నారు.



చందానగర్‌లో పోలీస్ స్టేషన్ కూడలి వద్ద పైప్‌లైన్ లీకేజీతో గుంతలు పడ్డ రోడ్డు

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కాలనీల్లో సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ముత్తంగి గ్రామ పరిధిలోని బేడ, బుడగ జంగం కాలనీలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సంప్రదాయ పద్ధతిలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్గత మురుగునీటి కాలువలు, విద్యుత్ స్తంభాలు, ఇంటి నంబర్లు, పట్టాలు అందించాలని ఎమ్మెల్యేకు కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. మురుగు నీటి కాలువలకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీకి జై భీమ్ నగర్ కాలనీగా నామకరణం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు సురేష్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, బీఆర్ఎస్ నాయకులు మెరాజ్ ఖాన్, సందీప్, యాదయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామ, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.



ముత్తంగిలో అధికారులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

శివాలయం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

గోకుల్ నగర్‌లోని శివాలయం ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయంలో పూజ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: తెలంగాణ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. మాదాపూర్ డివిజన్ సాయినగర్ కాలనీ నుంచి 100 మందికి పైగా యువకులు శ్రీనివాస్‌ముదిరాజ్, మహేందర్‌యాదవ్ నాయకత్వంలో బీజేపీలో చేరారు. సోమవారం వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ పాలనా దక్షత, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండిసంజయ్ నాయకత్వంలో పార్టీ దూసుకుపోతోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకూ బీజేపీ బలపడుతోందన్నారు. అందరూ కలిసి కట్టుగా పనిచేస్తూ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీజేపీలో చేరినవారిలో మహేంద్రయాదవ్, భిక్షపతియాదవ్, ఐలయ్య యాదవ్ ,శ్రీనివాస్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, అనిల్‌కుమార్ యాదవ్, మధుయాదవ్, శ్రీనివాస్ ముదిరాజ్, గోపాల్ ముదిరాజ్, బాలునాయక్ పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న నాయకులు రవికుమార్‌యాదవ్

బహుమతుల ప్రదానం

పటాన్‌చెరు: వాలీబాల్ విజేతలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన జీఎంఆర్ ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, పాల్గొన్నారు.

రంగనాథుడి బ్రహ్మోత్సవాలు



ఐటీ కారిడార్ నానక్‌రాంగూడలో వెలిసిన రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఆలయంలో బాలభోగం, అర్చన, బలిహరణ, ఆరాధన వంటి కార్యక్రమాలు అర్చకుల పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామార్చన చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. -రాయదుర్గం

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మియాపూర్ : దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళ్యాణ మండపంలో శేరిలింగంపల్లి దివ్యాంగుల పట్టణ సమైక్య ఆత్మీయ సమ్మేళనంను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ,కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి,అధికారులతో కలిసి దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు, సహాయ పరికరాలను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారీగా అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారులు మాన్వీ, ఉషారాణి, దివ్యాంగుల అసోసియేషన్ అధ్యక్షులు అశోక్, చందానగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

హఫీజ్‌పేట్ : భారత్ జోడో యాత్ర 4వేల కిలో మీటర్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శేరిలింగంపల్లి పీసీసీ డెలిగేట్ సత్యంరావు ఆదేశాల మేరకు సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్‌లోని హఫీజ్‌పేట్ గ్రామం హనుమాన్ ఆలయం వద్ద కాంగ్రెస్ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్రైం కార్నర్..

స్కూటీ అదుపుతప్పి కింద పడి..

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు టౌన్: స్కూటీ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణానికి చెందిన విశ్వనాథ్ (57) ఆదివారం రాత్రి మండల పరిధిలోని పోచారంలో ఫంక్షన్‌కు స్నేహితుడు శ్రీనుతో కలసి స్కూటీపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో స్కూటీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడింది. ప్రమాదం నుంచి తేరుకున్న శ్రీను పోచారం గ్రామానికి చెందిన స్నేహితుడు విక్రమ్‌కు ఫోన్‌లో తెలిపాడు. దీంతో ఘటనాస్థలానికి చేరుకుని ఇద్దరిని తన కారులో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిశీలించిన వైద్యులు విశ్వనాథ్ మరణించినట్లు ధ్రువీకరించారు. గాయపడిన శ్రీను చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

అత్తతో గొడవపడి కోడలు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: భూమి విషయంలో అత్త, కోడలు గొడవపడిన ఘటనలో కోడలు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన లక్ష్మి తన కూతురు మల్లేశ్వరిని 15 ఏళ్ల క్రితం బచ్చుగూడెంకు చెందిన కృష్ణతో వివాహం జరిపించింది. అనారోగ్యంతో కృష్ణ ఎనిమిది సంవత్సరాల క్రితం మృతిచెందగా.. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం భూమి విషయంలో అత్త పున్నమ్మకు కోడలు మల్లేశ్వరికి గొడవ జరిగింది. దీంతో మల్లేశ్వరి తల్లికి ఫోన్ చేసి గొడవ జరిగింది.. నేను ఇంటి నుంచి వెళ్లిపోతున్నాను అని చెప్పింది. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్ టాలెంట్ పరీక్షలో జేఎన్‌వి విద్యార్థుల ప్రతిభ



వీవీఎం పరీక్షలో రాణించిన జేఎన్‌వి విద్యార్థులకు బహుమతులను అందించిన ప్రిన్సిపల్ రత్నకుమార్

రాయదుర్గం: దేశంలోనే అతిపెద్ద సైన్స్ టాలెంట్ పరీక్షలో గోపన్‌పల్లి జవహర్ నవోదయ విద్యార్థులు ప్రతిభచాటారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వివిఎం) విజ్ఞాన్ ప్రసారభారతి ఆధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఈ పరీక్షను నిర్వహించింది. సోమవారం జేఎన్‌విలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ మాట్లాడుతూ కొండాపూర్‌లోని సంస్కృతి పాఠశాలలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ రాష్ట్రస్థాయి క్యాంపులో జేఎన్‌వి నుంచి 5గురు బాలికలు పాల్గొనగా అందులో 11వ తరగతి నుంచి నలుగురు, పదవ తరగతి నుంచి ఒకరు పాల్గొన్నారు. మొదటి ర్యాంక్ వైభవి రూ.5వేలు, రెండవ ర్యాంక్ మాధురి రూ.3వేలు, మూడవ ర్యాంక్‌లో మనీష రూ.2వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకున్నారని ఆయన వివరించారు.

క్రీడల్లోనూ రాణింపు..

విస్టా ఇంటర్నేషనల్ పాఠశాలలో అంతర్ పాఠశాల అథ్లెటిక్స్ పోటీలలో జేఎన్‌వీ విద్యార్థులు ప్రతిభ చాటారు. 9వ తరగతి అమృత, 8వ తరగతి నితిన్ పరుగు పందెంలో కాంస్య పతకం , 9వ తరగతి సంజయ్ కాంత్ లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం, 8వ తరగతి శివపెంచల్ విహార్ షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్, 8వ తరగతి దక్షత లాంగ్‌జంప్‌లో బంగారు పతకాన్ని సాధించారు. సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ విద్యార్థులను అభినందించి మెడల్స్‌ను అందించారు.

కేవీలో వార్షిక క్రీడోత్సవాలు



ట్రోఫీని అందిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ డా.రాజశేఖర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శోభన్‌బాబు

రాయదుర్గం: విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం, వాకింగ్ చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయ పదవ వార్షిక క్రీడోత్సవాలను సోమవారం క్యాంపస్‌లోని గురుబ్‌సింగ్ మైదానంలో నిర్వహించారు. ఈ క్రీడోత్సవాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. యువత దేశానికి వెన్నముకలాంటి వారని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడలలో పాల్గొన్న విద్యార్థులకు పతకాలు, ప్రశంసపత్రాలను అందించారు. అనంతరం ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ శోభన్‌బాబు, పీఈటీ విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో 251 బంగారు, 251 వెండి, 70 కాంస్య పతకాలను విజేతలకు అందించారు. పోటీలలో పాల్గొన్నవారందరికీ సర్టిఫికెట్లను అందచేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఎమ్మెల్యే గాంధీని కలిసిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రాన్ని ఇస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నేతాజీనగర్ వాసులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి వినతిపత్రాన్ని అందించారు. నేతాజీనగర్‌లో సీసీరోడ్డు, గోపన్‌పల్లి తండాలో వరదనీటి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్‌లోని సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంచందర్‌యాదవ్, నాయకులు తిరుపతి, రాయుడు, బుచ్చయ్యయాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ని సరళీకృతం చేయాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వీసీ బీజేరావు, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ రీసెర్చ్ ఎమిరేట్స్ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ ప్రొ.బాలసుబ్రమణియన్, విద్యార్థులు, ప్రొఫెసర్లు

- సామాన్యుల ప్రయోజనం కోసం వ్యాసాలు రాయాలి
- హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజేరావు సూచన

రాయదుర్గం: సైన్స్‌ని సరళీకృతం చేయాలని, సామాన్యుల ప్రయోజనం కోసం వ్యాసాలు రాయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. సోమవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో సెంటర్ ఫర్ రీజనల్ స్టడీస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ ఆధ్వర్యంలో సింప్లిస్టిక్ రైటింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ పథకం కింద తమ పరిశోధకులు, విద్యార్థుల కోసం 'బియాండ్ సింప్లిస్టిక్ రైటింగ్' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్ అండ్ టెక్నాలజీని అర్థం చేసుకోవడానికి సమయాన్ని వెచ్చించాలని చెప్పారు. ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ రీసెర్చ్ ఎమిరేట్స్ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ ప్రొ.బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ విద్యార్థులు ఏమి రాసినా అది దేనికి దారితీస్తుందో సూచించాలన్నారు. మీ భాష గురించి ప్రగల్భాలు పలకకండి, స్థానిక పదబంధాలతో సరళమైన భాషను ఉపయోగించాలన్నారు. ప్రతి అంశానికి శీర్షిక తప్పనిసరిగా ఆకర్షణీయంగా ఉండాలన్నారు. సాధ్యమైన చోట వ్యాసానికి సంబంధించి చిత్రాలను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఉషారామన్, డాక్టర్ తేజ బాలాంత్రపు, ఎస్ ఆనంద్, డాక్టర్ కీర్తన తంగవేలు, వర్క్‌షాప్ సమన్వయకర్తలు ప్రొఫెసర్లు ఆనంద్ కే కొండపి, అరవింద్ ఎస్ సుసర్ల పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి



గచ్చిబౌలి: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని కొండాపూర్ 8వ బెటాలియన్‌లో సోమవారం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ పి మురళీకృష్ణ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బెటాలియన్ అదనపు కమాండెంట్ టి గంగారాం, నరేందర్‌సింగ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కళ్యాణి, సహాయ కమాండెంట్‌లు దేవీదాస్‌రాథోడ్, ఎం రహమాన్, మినిస్టీరియల్ స్టాఫ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చందానగర్‌లో..

మియాపూర్ : చందానగర్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో..

గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో గాంధీ చిత్రపటానికి స్వాతంత్ర సమర యోధులు ఎడమ రాంరెడ్డి, సీనియర్ పాత్రికేయులు ఎబికె ప్రసాద్, ప్రొఫెసర్ వేణుగోపాల్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి చెన్నకేశవరావు, డాక్టర్ రజని, రాజేంద్రరావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: భీమ్ పార్కులో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, పృథ్వీరాజ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని గాంధీ విగ్రహానికి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్ పాల్గొన్నారు.



చందానగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, తదితరులు



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి